నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, బుధవారం 3 జూలై 2024 | YADADRI BHUVANAGIRI



సీఎం కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన జిల్లా నేతలు

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన పదవీ కాలం పూర్తి కావస్తున్న సందర్భంగా కేసీఆర్ శాలువా కప్పి సన్మానించారు. అలాగే భువనగిరి, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య కూడా కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ వారితో నియోజకవర్గ పరిస్థితులు, ఇతర అంశాలపై చర్చించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని కేసీఆర్ సూచించినట్లు వారు తెలిపారు.

జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

మఠంపల్లి బస్సులు లేక ఆటోల కోసం వేచి చూస్తున్న విద్యార్థులు

బడి బాటలో బస్సేది?

ఆర్టీసీ బస్సు సదుపాయం లేక విద్యార్థుల అవస్థలు

- జిల్లాలో నేటికీ 117 గ్రామాలకు నో ఆర్టీసీ బస్సులు
- అనేక పల్లెలకు ఒక్కటే బస్సు నడుస్తున్న వైనం
- సైకిళ్లు, ఆటో, ప్రైవేట్ వాహనాలే దిక్కు
- వినతులు అందించినా.. ఆందోళనలు చేసినా పట్టించుకోని అధికారులు

జిల్లాలోని అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడువడం లేదు. బస్సెరుగని ఊర్లు ఎన్నో ఉన్నాయి. ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు బడికి వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఆదాయం వచ్చే మార్గాలపైనే ఆర్టీసీ దృష్టిపెట్టడంతో పల్లెలకు బస్సులు రావడం లేదు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయానికి బస్సులు వేయాలని ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ప్రయోజనం ఉండటంలేదు. చేసేదేం లేక విద్యార్థులు నడుచుకుంటూనో, సైకిళ్లపైనో, ఇతర వాహనాలపై లిఫ్ట్ అడిగో వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

– యాదాద్రి భువనగిరి, జూలై 2 (నమస్తే తెలంగాణ)

117 గ్రామాలకు బస్సులు పోతలేవ్..

జిల్లాలో యాదగిరిగుట్ట డిపో మాత్రమే ఉన్నది. జిల్లా వ్యాప్తంగా 68 బస్సులు వివిధ ప్రాంతాలకు నడుస్తున్నాయి, యాదగిరిగుట్ట కొండపైకి 15 మినీ బస్సులు ప్రయాణికులను చేరవేస్తున్నాయి. నిత్యం 39వేల మంది ప్యాసింజర్లను తమ గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. జిల్లాలో 421 గ్రామాలు ఉండగా, ప్రతిరోజూ 304 గ్రామాలకు మాత్రమే బస్సులు వెళ్తున్నాయి. ఇందులో కొన్ని గ్రామాలకు షెటల్ బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. అంటే మన దగ్గర ఇంకా 117 గ్రామాలకు బస్సులు నడువడంలేదు. ఆయా గ్రామాలకు సరైన రోడ్డు సదుపాయం ఉన్నప్పటికీ బస్సులు మాత్రం రాకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఆర్టీసీ ఆదాయంపైనే దృష్టి పెడుతున్నదని, పల్లెలకు బస్సులు నడుపాలనే ఆలోచన చేయడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక జిల్లాలో ఉన్నదే ఒక్కటే డిపో. ఇక్కడ బస్సుల కొరత వేధిస్తున్నది. కొత్త బస్సుల కేటాయింపు జరుగడంలేదు. ఉన్న పరిమిత బస్సుల్లో మహా లక్షి పథకం వచ్చాక 98శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతుండటంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి.

పట్టించుకోని అధికారులు

గ్రామాలకు బస్సులు రాకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల అసలే బస్సు నడువకపోవడంపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారులపై ఒత్తిడి పెరుగుతున్నది. విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు వినతిపత్రాలు అందిస్తున్నారు. కొన్ని చోట్ల రోడ్లపై ధర్నాలు, ఆందోళనలు చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడంలేదు.

శాలిగౌరారం : తిరుమలరాయినిగూడెంలో బస్సు కోసం ఎదురు చూస్తున్న వల్లాల మోడల్‌స్కూల్ విద్యార్థులు

ఆత్మకూర్ (ఎస్) : ఏపూర్ నుంచి ఆత్మకూర్.ఎస్‌కు ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

3 నుంచి 10 కిలోమీటర్లు ఇబ్బందే..

జిల్లాలోని చాలా గ్రామాల్లోని ప్రాథమిక స్థాయి వరకు బడులు కొనసాగుతున్నాయి. దీంతో హైస్కూల్ కోసం 3 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇక పెద్ద సంఖ్యలో విద్యార్థులు మండల కేంద్రాల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. బస్సులు రాని గ్రామాల నుంచి వారంతా నడుచుకుంటూనో.. సైకిళ్లపైనో వెళ్తున్నారు. మండల కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు ఆటోలపై ఆధారపడుతున్నారు. ఆటోల్లో ప్రయాణం ఒక్కోసారి ప్రాణాల మీదికి తెస్తున్నా తప్పనిసరి పరిస్థితుల్లో ఆశ్రయించాల్సి వస్తున్నది. కొన్ని గ్రామాల్లో ఉదయం, సాయంత్ర వేళల్లో బస్సులు నడుస్తున్నా సకాలంలో రాకపోవడంతో ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వస్తున్నది. ఇలాంటి సమయంలో అమ్మాయిలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. పాఠశాల వెళ్లే సమయంలో, తిరిగి వచ్చే సమయంలో సాయంత్రం ఆకతాయిలు వికృత చేష్టలకు దిగుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఆత్మకూర్ (ఎస్) : దాచారం నుంచి ఆత్మకూర్.ఎస్‌కు సైకిల్ మీద వస్తున్న విద్యార్థులు

జిల్లా పరిషత్‌లో సన్మానం అనంతరం జడ్పీటీసీ సభ్యులు, కలెక్టర్ హనుమంతు కే. జెండగే

జిల్లా అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం మరువలేనిది

- జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి
- జడ్పీటీసీ సభ్యులకు ఘన సన్మానం

భువనగిరి అర్బన్, జూలై 2 : జిల్లా అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యం మరువలేనిదని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షుల ఐదేండ్ల పదవీ కాలం ముగింపు సందర్భంగా మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు అధికారులు విశేష కృషి చేశారని, అందరి సహకారం గుర్తుండి పోతుందని అన్నారు. స్థానిక సంస్థలు మరింత బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించారు. శాసనమండలి సభ్యుడు సీహెచ్ నవీన్‌కుమార్ (తీన్మార్ మల్లన్న) మాట్లాడుతూ ప్రజల అభిమానం పొందితే తిరిగి ఎన్నిక కావచ్చునని, రైట్ టు రీకాల్ భవిష్యత్ తరాలకు అవసరమని, ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలు, వ్యవస్థలు మరింత బాగుపడతాయని అన్నారు. కలెక్టర్ హనుమంత్ కే.జెండగే మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామాలను బలపేతం చేయడానికి మూడు అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడిందని, ఐదు సంవత్సరాల కాలంలో గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు బాగా కృషి చేసినందుకు అభినందనలు అని అన్నారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎన్.శోభారాణి మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లో 17 జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశాలు, 21 వివిధ స్టాండింగ్ కమిటీ సమావేశాలు పూర్తి కోరంతో నిర్వహించామన్నారు. తద్వారా ప్రజా ప్రతినిధులు, అధికారులతో వివిధ అంశాలపై చర్చించి వారి ప్రాదేశిక నియోజక వర్గ సమస్యలు పరిష్కరించేందుకు సాధ్యమైందని తెలిపారు. కరోనా సందర్భంగా ప్రత్యక్షంగా సమావేశాలు ఏర్పాటు సాధ్యం కాకపోవడంతో వర్చువల్ సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. 2022 జనవరి నుంచి ఇప్పటివరకు కారుణ్య నియామకాల కింద ఆరుగురికి ఆఫీస్ సబార్డినేట్ నియామకం చేశామని చెప్పారు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు రూ. 1,837.63 లక్షలు మంజూరయ్యాయని, మండల పరిషత్ వాటా నిధుల కింద రూ. 1,531.59 లక్షలతో పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు 2024-25 సంబంధించిన పనుల ప్రతిపాదనలు యాక్షన్ ప్లాన్ తయారు చేసి ఈ గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేశామని అన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బికూనాయక్, జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు మాట్లాడుతూ ఈ ఐదేండ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, అనుభవాలను వివరించారు. అనంతరం సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అధ్యాపకులు నైపుణ్యాలు పెంచుకోవాలి

- ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి



శిక్షణలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి

రామగిరి, జూలై 2 : మారుతున్న కాలానికి అనుగుణంగా అధ్యాపకులు బోధన నైపుణ్యాలు పెంచుకోవాలని ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి సూచించారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్, ఎడ్యునట్ ఫౌండేషన్- న్యూఢిల్లీ, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్(టాస్క్) సౌజన్యంతో ఎంజీయూ ఇంజినీరింగ్ కళాశాలలోని అధ్యాపకులకు మంగళవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ నెల 6 వరకు ఈ శిక్షణ కొనసాగనున్నది. ఈ సందర్భంగా అల్వాల రవి మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతర విద్యార్థులేనని, మారుతున్న సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకొని బోధన చేయాలన్నారు.

సమాజంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సైతం కృషి చేయాలని చెప్పారు. ప్రస్తుతం అంతా కంప్యూటర్ యుగంతోనే సాగుతుందని డేటా, మెషిన్ లెర్నింగ్, కృత్రిమ మేధాపై అధ్యాపకులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, ఎంజీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సుధారాణి, ఇంజినీరింగ్ కళాశాల డీన్ రేఖ, ఎంజీయూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ వై. ప్రశాంతి, సీనియర్ అధ్యాపకురాలు ఎం.జయంతి ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి

నిరుద్యోగ భృతి.. జాబ్ క్యాలెండర్ ఏమైంది?

- అధికారం రాగానే హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్
- నిరుద్యోగుల జీవితాలతో సీఎం రేవంత్‌రెడ్డి ఆటలు
- కోదండరాం నిరుద్యోగ సమస్యలపై ఎందుకు ప్రశ్నిస్తలేరు?
- ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి

యాదాద్రి భువనగిరి, జూలై 2 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, అధికారంలోకి రాగానే ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి మాటే మరిచిపోయిందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి మండిపడ్డారు. మెగా డీఎస్సీ, ఉద్యోగాల నోటిఫికేషన్, జాబ్ క్యాలెండ్ ఏమైందని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతిపై ఆశలు కల్పించడం ద్వారా ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందన్నారు. ఆ మాటలు నమ్మిన నిరుద్యోగులు కాంగ్రెస్ గెలుపునకు కృషి చేశారని చెప్పారు. భువనగిరి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులను రెచ్చగొట్టిన రేవంత్ రెడ్డి, కోదండరాం, తీన్మార్ మల్లన్న పదవులు రాగానే నోర్లు మూగబోయాయన్నారు. అధికారంలోకి రాగానే 2లక్షల ఉద్యోగాల హామీ మరిచిపోయారని అని ప్రశ్నించారు. 1:100 గ్రూప్ వన్ సెలక్షన్ ఏమైందన్నారు. టీజేఎస్ చీఫ్ ప్రొఫెసర్ కోదండరాం నిరుద్యోగ సమస్యల పక్షాన ఎందుకు పోరాటం చేయడంలేదని విమర్శించారు. కోదండరాం పదవి రాగానే నోటి నుంచి మాటలు రావడంలేదని, కోదండరాం అంటే అపారమైన గౌరవ ఉండేదని, సమస్యలపై స్పందించకపోవడం బాధేస్తుందని తెలిపారు. గురుకుల అభ్యర్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారని, టీజేఎస్ పార్టీ ఎటు పోయిందని నిలదీశారు. 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని ప్రగల్భాలు పలికారని, వారికి పోస్టింగ్‌లు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. గురుకుల అభ్యర్థి భానుప్రియ తొలి అపాయింట్‌మెంట్ ఇచ్చి పోస్టింగ్ ఇవ్వకుండా మోసం చేశారని చెప్పారు. దివ్యాంగురాలు రజినీకి అపాయింట్ ఆర్డర్లు ఇచ్చి ఫేక్ డబ్బా కొట్టుకున్నారని, ఆమెకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చారని విమర్శించారు. రేవంత్ రెడ్డి.. కలెక్టర్ చేసే పనులు చేస్తున్నారని, ఆయన స్థాయి రోజురోజుకు దిగజారిపోతున్నదని పేర్కొన్నారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ వ్యవహారాన్ని నిలదీస్తామని, నిరుద్యోగులకు అండగా ఉంటామని, సమస్యలపై ప్రభుత్వంతో పోరాటం చేస్తామని చెప్పారు. నిరుద్యోగుల పక్షాన పోరాడుతున్న గిరిజన బిడ్డ మోతీలాల్ నాయక్‌కు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పాలనలో అశాంతి పెరిగిపోయిందని, శాంతి భద్రతలు క్షీణించాయని చెప్పారు. పోలీసులు సివిల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్గత కుమ్ములాటలతో పాలనపై పట్టు కోల్పోయిందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ యాదగిరిగుట్ట మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, రాజాపేట జడ్పీటీసీ గోపాల్‌రావు, ఎంపీపీలు సుధీర్ రెడ్డి, తాండ్ర అమరావతి శోభన్, బీఆర్ఎస్ నేత కొలకొండ లక్ష్మీరాములు, జడ్పీ కోఆప్షన్‌మెంబర్ ఎండీ ఖలీల్, ఎం. శ్రీనివాస్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఫారిన్‌లో టీచర్లు.. పాఠాలు చెప్పేదెవరు?

సెలవులపై అమెరికాకు వెళ్లిన ముగ్గురు ఉపాధ్యాయులు

- 20 రోజులు గుడుస్తున్నా మొదలు కాని తరగతులు
- సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో విద్యార్థులు ఇబ్బందులు

సంస్థాన్ నారాయణపురం, జూలై 2 : సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఇటీవల బదిలీలో భాగంగా వచ్చిన ఇద్దరు ఉపాధ్యాయురాళ్లు, ప్రస్తుతం ఇక్కడే డ్యూటీ చేస్తున్న మరొక ఉపాధ్యాయురాలు విధులకు రావడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభించి 20 రోజులు గుడుస్తున్నా వారు సెలవులో ఉన్నారు. వారు వ్యక్తిగత పనుల నిమిత్తం అమెరికాకు వెళ్లినట్లు సమాచారం. దాంతో పాఠాలు చెప్పే వారు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో ప్రస్తుత్తం ఉన్న ఉపాధ్యాయులు వారి క్లాసులు చెప్పి వెళ్లిపోతున్నారు. మిగతా టీచర్లు ఎప్పుడు వస్తారోనని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. తరగతులు జరిగే సమయంలో టీచర్లు లేక విద్యార్థులు ఆటలతో కాలక్షేపం చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయులు దీర్ఘకాల సెలవులపై వెళ్తే విద్యార్థులకు పాఠాలు చెప్పేది ఎవరని పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

రెండు పాఠశాలల్లో ముగ్గురు లాంగ్ లీవ్‌లో..

మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 120 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ ప్రస్తుతం నలుగురు ఉపాధ్యాయులు ఉండగా ప్రధానోపాధ్యాయుడు రిటైర్డ్ అయి వెళ్లిపోయారు. ఇక్కడ పని చేసే ఇద్దరు ఉపాధ్యాయులు బదిలీలో భాగంగా వేరే పాఠశాలకు వెళ్లిపోగా మరో ఇద్దరు ఎస్‌జీటీలు బదిలీపై పాఠశాలకు వచ్చారు. ప్రమోషన్‌లో భాగంగా ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయురాలిని కేటాయించినా ఆమె అమెరికాకు వెళ్లడంతో ఇంతవరకు పాఠశాలకు హాజరు కాలేదు. 120 మంది విద్యార్థులకు ప్రస్తుతం ముగ్గురు ఉపాధ్యాయులు వారి క్లాసులు చెప్పి వెళ్లిపోతున్నారు. అమ్మ అదర్శ పాఠశాలకు ఎంపికైన ఈ పాఠశాలలో గతంలో ఉన్న ప్రధానోపాధ్యాయురాలు పనులు ప్రారంభించకపోవడంతో విద్యార్థులు వాష్‌రూమ్ వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండల కేంద్రంలోని మండల పరిషత్ బాలికల పాఠశాలలో 50 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం ఇక్కడ నలుగురు టీచర్లకు ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. బదిలీపై ఇక్కడికి వచ్చిన ఒక ఉపాధ్యాయురాలు, ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న మరొక ఉపాధ్యాయురాలు అమెరికాకు వెళ్లారు. పాఠశాలకు వారు ఇంత వరకు రాకపోవడంతో తరగతులు జరుగక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు పాఠశాలలో కలిపి మొత్తం ముగ్గురు ఉపాధ్యాయులు అమెరికాలో ఉన్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని, ప్రత్యామ్నాయ ఆలోచన చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారికి బదులు కొత్త టీచర్లను నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు. దీనిపై ఎంఈఓ నాగవర్ధన్ వివరణ అడుగగా పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనని తెలిపారు. ముగ్గురు టీచర్లు సెలవుపై అమెరికాకు వెళ్లారని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపికైన పాఠశాలలో మౌలిక వసతుల పనులను త్వరలోనే పూర్తి చేయిస్తామని తెలిపారు.

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో టీచర్ లేకపోవడంతో ఖాళీగా కూర్చున్న విద్యార్థులు